# పాపులర్ రచనలు చేయుటం ఎలా?

## యండమూరి వీరేంద్రనాథ్

(క్రిందటిసంచిక నుంచి తరువాయి)

***కథలు - సీరియల్స్ - నవలలు***

ఒక వర్ధమాన రచయితకి రచన చేయుటం ఎంత కష్టంగా తోస్తుందో, దాన్ని పత్రికకి పంపించటం కూడా అంతే టెన్షన్‌ని కలిగిస్తుంది. ఎన్నో అనుమానాలు వస్తుంటాయి. తను పంపించిన వ్రాతప్రతి పత్రికాధిపతులు చదువుతారా? పోస్టులో అందుతుందా? ఎంతకాలంలో తనకి వారి దగ్గరినుంచి రచన ప్రచురిస్తున్నట్టు ఉత్తరం వస్తుంది? అని రకరకాల అనుమానాలు కలగటం సహజమే. వీటన్నిటి గురించి వరసగా చర్చిద్దాం.

1. రచనని పత్రికకి పంపించేటప్పుడు కాగితానికి ఒక ప్రక్కే వ్రాయాలి. కంపోజింగ్ పద్ధతి పోయి, కంప్యూటర్ ప్రింటింగ్ వచ్చిన తరువాత పత్రికాధిపతులు ఈ విషయమై నిబంధన విధించకపోయినా కూడా, కాగితానికి ఒక ప్రక్క వ్రాయటమే మంచిది. ఎడమవైపు కొద్దిగా మార్జిన్ వదలాలి. మరీ పేజీ మొదటినుంచి చివరివరకూ వ్రాయటం కన్నా, కొద్దిగా ఖాళీ వదిలి వ్రాయటం వల్ల చదివే వ్యక్తి కళ్ళకి ఆహ్లాదంగా ఉంటుంది.

2. ఒక పత్రికాఫీసులో సబ్ -ఎడిటర్ రోజుకు కనీసం పాతికదాకా కథలు చదువుతాడు. దస్తూరి బాగా లేని పక్షంలో మొదట్లోనే అతడికి ఆ రచనపట్ల అంత ఆసక్తి ఉండదు. మొదటి నాలుగైదు పేరాగ్రాపుల్లో వర్ణనలు ఎక్కువగా ఉండి దస్తూరి బాగా లేకపోతే దాన్ని ప్రక్కన పడేసే ప్రమాదం ఉంది. ఆ తరువాత రచన ఎంత బాగున్నా సరే.

3. చాలామంది రచయితలు తన రచనకి కాపీరైట్ రిజిస్ట్రేషన్ చేసే అవసరం ఉందా అని వ్రాస్తూ ఉంటారు. అలాంటి చట్టాలేమి భారతదేశంలో లేవు. ఒక పుస్తకాన్ని పబ్లిషర్‌కి పంపించినా, ఎడిటర్‌కి పంపించినా దాన్ని తమ పేరు మీద వేసుకునే స్థితి ఎడిటర్‌లకి లేదు. ఒక సినిమా కథని ప్రొడ్యూసర్‌కి పంపిస్తే దాన్ని కాపీ కొట్టి అతను సినిమా తీయడు. దానికన్నా పదివేలో, ఇరవై వేలో రచయితకిచ్చి దాన్ని కొనుక్కుంటాడు. నిజంగా నిర్మాతకు నచ్చే విధంగా కథ వ్రాసి పంపిస్తే ఆ నిర్మాత రచయితని వదులుకోడు. తన దగ్గరకు పిలిపించుకుని ఆ కథని మరింత అందంగా తీర్చిదిద్దుకునేలాగ ప్రయత్నం చేస్తాడు. ఈ విషయమై రచయితకు సంశయాలు, శంకలు అనవసరం.

4. ఒక రచనని పత్రికకి పంపించినప్పుడు తిరుగు స్టాంపులు పెట్టినా సరే, ఒక్కోసారి కథ వెనక్కి రాదు. అలాగే 'మా పత్రికలో మీ కథ వేసుకుంటాం' అని పత్రికవాళ్ళు ఉత్తరం వ్రాసిన చాలాకాలం దాకా కూడా కథ ప్రచురింపబడదు. ఇటువంటి పరిస్థితుల్లో, తిరిగి మరో పత్రికకి తమ రచనని ఎప్పుడు పంపించాలీ అనేది చాలా మందికి సంశయం కలుగుతుంటుంది.

ఒక పత్రికకి కథ పంపించినప్పుడు ఫోటోస్టాట్ కాపీ తీయించుకుని దగ్గర ఉంచుకోవటం ఎప్పుడూ సక్రమమైన పద్ధతి. రెండు మూడు పత్రికలకి ఒకేసారి ఒకే కథని పంపించినా అందులో తప్పేమీ లేదు. ఒక పత్రిక నుంచి అంగీకార పత్రం రాగానే, మిగతా

పత్రికలకి తమ కథ ప్రచురించవద్దని, అది మరో పత్రికలో పడబోతుందని వ్రాసినా పత్రికాధిపతులేమీ కోపం తెచ్చుకోరు. దీనివల్ల రచయిత అనవసర భయాలు పెంచుకోవాల్సిన అవసరం లేదు. అలా కాకుండా తిరుగు స్టాంపులంటించిన కవరు జతచేసి పంపించిన తరువాత మూడు నెలలవరకూ ఆ కథ ప్రచురించకపోతే లేదా వెనక్కి పంపించకపోయినా, ఆ కథని మరో పత్రికకి నిరభ్యంతరంగా పంపించుకోవచ్చు.

చాలామంది రచయితలు ఒక కథ పత్రికకి పంపించిన తరువాత, తమ కథ విషయం ఏం జరిగింది అని ఉత్తరాలు వ్రాస్తూ ఉంటారు. అలాంటి ఉత్తరాలకి ఏ పత్రిక సమాధానం ఇవ్వదు. సమయం వృధా చేసుకోవటం అనవసరం. దీనికన్నా నాలుగైదు పత్రికలకి తలా ఒక కాపీ పంపించటం మంచి పద్ధతి.

5. తను కథలు ఎడిటర్‌లు చదవరని, కేవలం రికమండేషన్ల మీదే కథలు వేసుకుంటారని చాలామంది వర్ధమాన రచయితలకి అపనమ్మకం.

ఏ ఎడిటర్ కూడా మంచి కథను వదులుకోడు. పత్రికాఫీసుకొచ్చిన దాదాపు ప్రతీ కథని సబ్ - ఎడిటర్లు చదువుతారు. ఏ మాత్రం బావున్నా ఎడిటర్లకి పంపిస్తారు. కేవలం అందని ద్రాక్ష పళ్ళు పులుపు అన్న విధంగా, తమ కథ ప్రచురణ కాకపోతే అది ఎడిటర్ల చదవకపోవడం వల్లనే ఆ విధంగా జరిగిందని భావించడం అనవసరం. ఒక పత్రికకి రోజుకి కనీసం వందల సంఖ్యలో కథలు, గేయాలూ వస్తుంటాయి. అందువల్ల రచనలు ప్రచురింపబడటానికి అవకాశం తక్కువ. పేరున్న రచయితలనే వేసుకుంటారు అన్న అపప్రధ ఉంది. అది కొంతవరకూ నిజమే అయినా, వర్ధమాన రచయితల్లో నిజంగా మంచి రచన ఏదయినా ఉంటే ఎడిటర్లు తప్పక వేసుకుంటారు.

మా దగ్గరికొచ్చే వర్ధమాన రచయితలతో "మీ ఈ రచన స్టాండర్డ్‌లో లేదు." అని అనగానే వెంటనే వాళ్ళు, "ఇపుడు పత్రికల్లో వచ్చే కథలకన్నా ఇది బాగానే ఉంది కదండీ." అని సమాధానం ఇవ్వటం తరచూ జరుగుతుంటుంది. ప్రస్తుతం పత్రికల్లో వస్తున్న కథలకన్నా ఆ రచన బాగుండి ఉండవచ్చు. కానీ అది ప్రచురింపబడటానికి కేవలం అదొక్కటే క్వాలిఫికేషన్ కాదు. 'ప్రస్తుతం ఇలాంటి రచనలు వస్తున్నాయి. కాబట్టి మేముకూడా ఇంత బేవార్సుగానే వ్రాస్తాం' అని రచయిత ఎప్పుడయితే అనుకుంటాడో ఆ రచయిత మంచి రచయిత కాలేడు. ఎడిటర్ల మనస్తత్వమెప్పుడూ మూడీగానే ఉంటుంది. ప్రొద్దున లేస్తే ఎన్నో కథలు చదవటం వలన వారికి అదోరకమైన నిర్లిప్తత, నిరాసక్తత ఆవరించి ఉంటుంది. రచనలో ఏమాత్రం పసవున్నా వారిలో ఉత్సాహం పొంగిపొర్లుతుంది. సాదాసీదాగా ఉంటే మొదటిపేజీ చదవగానే ప్రక్కన పడెయ్యాలనిపిస్తుంది. ఇక్కడో ముఖ్యవిషయం గమనించాలి. ఆకలి, చావులు, బూర్జువాలూ, వాళ్ళ దౌర్జన్యాలూ మొదలైన కథలు కుప్పతెప్పలుగా పత్రికాఫీసులకి వస్తూ ఉంటాయి. పత్రిక పెట్టింది అమ్ముకోవటం కోసం. ఆహ్లాదకరమైన రచనలకి ఎప్పూడూ స్థానం ఉంటుంది. అలాగే కొంచెం శృంగారం, రొమాన్స్, ఆప్టిమిజం, హాస్యం మొదలైన వాటికి ఎడిటర్లు త్వరగా స్పందిస్తారు. సాధారణంగా ఒక యూనివర్సిటీ ప్రేమకథో, ఆహ్లాదకరమైన కథో వస్తే ఎడిటర్లు వాటిని వెంటనే ప్రచురించడానికి ఇష్టపడతారు. ఈ విషయం వర్ధమాన రచయితలు గుర్తుంచుకుంటే మంచిది. ఒక పత్రికలో అన్నీ బాధాకరమైన కథలు వేస్తే, ఆ పత్రికాధిపతి తరువాత తీరిగ్గా బాధపడాలి. అదే విధంగా సామాజిక స్పృహ పేరిట వ్రాసే కథలు కూడా పత్రికల్లో రెండు మూడు వారాలకో, నాలుగైదు వారలకో మాత్రమే ఒకటి పడటం మన గమనిస్తుంటాం.

6. సాధారణంగా నాలుగు - ఎనిమిది పేజీల మధ్యనున్న కథని ఎడిటర్లు ప్రచురణ యోగ్యంగా భావిస్తారు. అంతకన్నా పెద్ద కథయితే కష్టం. పొట్టికథల సంగతి సరే. అవి ఫిల్లర్స్‌గా ఉపయోగపడుతాయి.

7. నవల ఎన్నిపేజీలు వ్రాయాలని తరచూ వర్ధమాన రచయితలు మమ్మల్ని తరచూ అడుగుతుంటారు.

లైన్‌కి ఇరవైనాలుగు (24) అక్షరాలు చొప్పున, కాగితానికి 28 లైనులు వ్రాస్తూ అలాంటివి 260 పేజీలు వ్రాస్తే 35 రూపాయల నవల అవుతుంది. ఇది సరియైన నవల సైజు, దీనికన్నా ఎక్కువ వ్రాసేవాళ్ళు, కాస్త తక్కువ వ్రాసేవాళ్ళు ఉన్నారు కానీ, ఎటువంటి పరిస్థితిలోనయినా రెండొందల పేజీలకన్నా తక్కువ వ్రాస్తే నవల ప్రచురింపబడటం కష్టం. నవలికలకి ప్రస్తుతం మార్కెట్ లేదు.

కొంతమంది రచయితలు ఇటీవల రెండొందలు పేజీల పుస్తకాన్ని కూడా ముప్పైరూపాయలు పైగా వెలబెట్టి అమ్ముతున్నారు. ఇది కేవలం పాఠకుల్ని మోసం చేయడం మాత్రమే. పుస్తకాన్ని కొనేటప్పుడు కూడా పుస్తకం ధర పేజీకి పదమూడు పైసలకన్నా ఎక్కువ ఉంటే ఆ పుస్తకాన్ని కొనకుండా ఉండటం ద్వారా ఇటువంటి రచయితలకి, పబ్లిషర్లకి పాఠం చెప్పవచ్చు. మరి కొందరు రచయితలు మరీ తెలివిమీరి వాక్యం క్రింద వాక్యంవ్రాసి పేజీలు నింపుతున్నారు. ఈ విషయమై ఈ పుస్తకంలో క్రితం అధ్యాయంలో చర్చించాను. ఇదే విధంగా పేజీకి 27 లైన్లకన్నా తక్కువవుంటే పబ్లిషరు మనల్ని మోసం చేస్తున్నట్టే. *(ఈ అంచనాలు 15, 20 సంవత్సరాల క్రిందటివి అని పాఠకులు గమనించగలరు - సంపాదకుడు)*

8. పత్రికలో రచన సీరియల్‌గా వచ్చినప్పుడు ఏ వారానికావారం ఎక్కడ ఆపుచేస్తే మంచిదో మనమే సూచిస్తే మంచిది. అటువంటప్పుడు ఆరుపేజీలకి గానీ, ఎనిమిది పేజీలకి గానీ ఒక చిన్న ట్విస్ట్ పెట్టి అక్కడ ఆపుచేస్తే, పాఠకుడికి వచ్చేవారం ఏమవుతుందా అని ఉత్సుకత మొదలవుతుంది. (లైన్‌లు అక్షరాలు పైన చెప్పిన విధంగానే వ్రాస్తూ ఆరు - ఎనిమిది పేజీల మధ్య ఈ సశేషం ఉండేలా చూసుకోవాలి.)

9. పైన పుస్తకం ఖరీదు గురించి చర్చించటం జరిగింది. ఇప్పుడు దీని యొక్క ధర, వెల గురించి చర్చిద్దాం. పేజీకి పదమూడు పైసలు ధర సాధారణంగా నిర్ణయించడం జరుగుతుంది. ఆ విధంగా రెండొందల యాభై పేజీల పుస్తకాన్ని ముప్పై రెండు రూపాయలు ధరగా నిర్ణయించామనుకుందాం. దీనిమీద వివరణ ఈ విధంగా ఇవ్వొచ్చు.

| | |
|---|---|
| రెండువేల పుస్తకాల మొత్తం అమ్మకం | 64,000 |
| ప్రొడక్షన్ ఖర్చు | 16,000 |
| డిస్ట్రిబ్యూషన్ ఖర్చు | 34,000 |
| రచయితలకీ, పబ్లిషర్‌కీ కలిపి మిగిలేది | 14,000 |
| అడ్వర్టయిజ్ మెంట్, వడ్డీ | 2,000 |
| మొత్తం | 64,000 |

వర్ధమాన రచయితల క్రొత్త పుస్తకాలు సాధారణంగా రెండు వేల కాపీలతో ప్రారంభిస్తారు. ఆ తరువాత అతడి యొక్క పాపులారిటీ బట్టి అది పెరుగుతూ వస్తుంది. తులసీదళం, సెక్రటరీ లాంటి నవలలు ముప్ఫై, నలభైవేల మధ్యలో అమ్ముడుపోయాయి. పాపులర్ నవలా సాహిత్యంలో ఇవే రికార్డ్ అమ్మకాలు.

ఎవరయినా రచయిత తమ నవలని సొంతంగా ప్రింట్ చేసుకోవాలంటే పై లెక్కలు ఉపయోగపడతాయి. కనీసం పదహారువేల రూపాయల పెట్టుబడి ఉండాలి. పుస్తకం ప్రింట్ చేసిన తరవాత ఎవరయినా డిస్ట్రిబ్యూటర్‌కి ఇవ్వొచ్చు. ప్రస్తుతం ఉన్న మార్కెట్‌లో క్రొత్త రచయితలు తమ రచనని తామే ప్రచురిస్తే వంద కాపీలన్నా ఎక్కువ అమ్ముడుపోవడం కష్టం. ఈ విషయమై ఔత్సాహికులు చాలా జాగ్రత్తగా ఉండాలి.

10. పత్రిక యొక్క అమ్మకాలు, స్టాండర్డ్‌ని బట్టి రచయితకి పారితోషికం ఇవ్వడం జరుగుతుంది. కథలకి సాధారణంగా యాభైనుంచి రెండువందల రూపాయల వరకూ పారితోషకం ఇవ్వడం జరుగుతుంది. ఇండియా టుడేలాంటి పత్రికల్లో కథ పడితే వెయ్యిరూపాయలనుంచి మూడువేల వరకూ ఇస్తారు. అయితే అలాంటి పత్రికలు సాధారణంగా ప్రసిద్ధ రచయితలనుంచి కథల్ని "కోరి"

ప్రచురిస్తాయి కాబట్టి వర్ధమాన రచయితలకి అవకాశం లేదు. చాలా పత్రికలు, ముఖ్యంగా అప్పుడప్పుడే పైకి వస్తున్న పత్రికలు రచయితల కథలకి పారితోషికం ఇవ్వటం జరగదు. ఆశపెట్టుకోవటం అనవసరం.

కొత్త రచయితలకి సీరియల్‌కి మూడువేల నుంచి పదివేల వరకూ ఈ పారితోషకం ఉంటుంది.

ఒక పబ్లిషర్ నవలని ప్రచురిస్తే రెండువేల నుంచి ఏడువేల వరకూ పారితోషికం ఇస్తాడు. నాలుగైదు రచనలు చేసి, తరువాత రచయిత పారితోషికం ఏడువేల నుంచి - పన్నెండువేల వరకూ పెరుగుతుంది. బాగా పాపులరైజ్ అయితే, అమ్మకాల మీద పదినుంచి ఇరవై శాతం రాయల్టీ తీసుకునే రచయితలు కేవలం ఒక్కరో ఇద్దరో ఉన్నారు. ఈ స్థాయికి రావాలంటే వాసి ముఖ్యమే కాని, అంతకన్నా రాశి కూడా ముఖ్యం. సంవత్సరానికి మూడు నాలుగు నవలలు వ్రాస్తూవుంటే ఆ పేరు నలుగురి నోళ్ళలోనూ నానుతుంది.

ఒక అద్భుతమైన నవల వ్రాసి ఊరుకుంటే, దాని అమ్మకాలు బావుంటాయని అనుకోవటం పొరపాటు. బ్రాండ్ నేమ్ చూసి మనం మార్కెట్‌లో వస్తువును ఎలా కొంటామో రచయిత పేరు తరచూ వినబడుతుంటే అతని పుస్తకాలకి మార్కెట్ ప్రముఖ స్థానం వహిస్తాయి. దాదాపు వెయ్యి కాపీల వరకూ ఈ లైబ్రరీలవారే కొంటూ ఉంటారు. వాళ్ళతో కొనిపించాలంటే తప్పనిసరిగా ఎక్కువ పుస్తకాలు వ్రాయాలి. పాఠకులు లైబ్రరీకి వెళితే, అట్టమీద రచయిత పేరు చూడగానే, ఇతను బాగానే వ్రాస్తాడు - అనిపించాలంటే, ఆ రచయిత నవలలు కొన్నయినా మార్కెట్‌లో ఉండాలి.

ముందు ఎస్టాబ్లిష్ అయింతరువాత "రాశి" తగ్గించి "వాసి" పెంచినా ఫరవాలేదు. మొదట్లో మాత్రం "రాశి" ముఖ్యం. ఇది చాలా విడ్డూరంగానూ, వింతగానూ, నిర్వాతుకంగానూ కనపడవచ్చుగానీ నగ్నసత్యం!

ప్రతీ రచనతో పాటు హామీ పత్రం పంపాలి. ఆ హామీ పత్రం ఈ విధంగా ఉండాలి.

"ఇది నా స్వంత రచన. దేనికీ అనువాదమూ, కాపీ కాదు - సంతకం."

11. పత్రికకి నవల పంపించేటప్పుడు ఫోటో స్టాట్ కాపీ పంపిస్తూ, బ్రాకెట్‌లో "దీని ఒరిజినల్ కాపీ నా దగ్గరే ఉన్నది. మీకు అంగీకారమైన పక్షంలో దానిని పంపించగలను." అని వ్రాయటం మంచిది. రిటర్న్ స్టాంపులు పెట్టినా సరే ఒక్కోసారి పోస్ట్‌లో మిస్సయ్యే ప్రమాదం ఉంది కాబట్టి ఈ జాగ్రత్త అవసరం.

12. వర్ధమాన రచయితలు పత్రికాధిపతులకి మొత్తం నవలంతా ఒకేసారి పంపించటం అవసరం. లేదా స్వయంగా వెళ్ళి ఎడిటర్‌ని కలుసుకుని తను వ్రాయదలచుకున్న నవలని సినాప్సిస్ (కథాంశాన్ని) ఒక పేజీ వ్రాసి చూపించి ఎడిటర్ ఒప్పుకున్న తరువాత నవల ప్రారంభించడం మరో పద్ధతి. అయితే ప్రస్తుతం ఒకరిద్దరు ఎడిటర్లు తప్పితే, మిగతా ఎడిటర్లెవరూ అంత ఓపిగ్గా తీరిగ్గా వర్ధమాన రచయితలతో మాట్లాడే స్టేజీలో లేరు.

వచ్చే సంచికలో.. సినిమా రచన